కథ

నవజాగృతి

— శ్రీ "ప్రయాగ" —

"ఏమే రామిరెడ్డీ, దేశముఖు గడీకి బీగా లేసిపోయెను. పోలీసుల్తోస్తారంట - మనిం ట్లో గింజుదామా?" అని ఇవాళే పట్నాన్నే కొత్తగా తెచ్చుకున్న ఆత్మీయాలతో పలక రించటం చూస్తే కొంచెం చిరాకేసింది రామిరెడ్డికి. అసలికి ఈ ఆత్మీయాలు ఎంత అర్థమైందో, దేశముఖు గడీకి బీగా లేసి పోవటం కూడా అంతే అర్థమయింది.

"గడీకి బీగాలేంది మామా?" అని అడి గాడు ఆశ్చర్యంగా. చెప్పవలసిందేమీ లేన ట్టుగా ముఖం చిట్లించి, అట్లా ఒక్కసారి తేరి పారచూసి - "ఏం చేస్తాం? ఖర్మ! అయినా... మనూళ్ళోవాళ్ళ నీచుల్తో నాటే పొయ్యేవాళ్ళ కానుకలో... కాని కీడెంచి మేలెంచమన్నారు. మాస్తుంటేమిగా చుట్టు పట్టూళ్ళలో - ఒక్కచోటు నిలిచేందుకు ఆస్కారం వుందా!" అని అని తాను భూతికోసమేమో ఎదురు చూస్తున్నాడు పట్నాన్నే.

రామిరెడ్డి మనస్సులో నూతన యుగాలు పరిగెత్తినట్లయింది. ఏవేవో జ్ఞాపకాలు గిర గిరా తిరిగిపోతున్నాయి. తన పంథొమ్మి దోయేట, తాను చదువు ప్రారంభించినప్పు డు... "అరవైయేళ్ళొచ్చి చదువుకోక నోట మన్ను కొట్టుకుంటావా అని ఇప్పుడు చదు వేంటిరా? కాస్త కొండ్రవున్న ముండా కొడుకా!" అని పట్వారీ ఎద్దేవా చెయ్య డం ఎట్లా మరచిపోతాడు? తర్వాత తర్వాత ఇరుగు పొరుగువాళ్ళకు కాగితం చదువుతూ రాసిపెట్టటం చూసి... "కలి కాలం వచ్చేసింది. రాజు రెడ్డవుతాడు రెడ్డి రాజవుతాడు. బ్రహ్మంగారు ఊరికే అన్నారా?" అని ఈ పట్వారీయే వేదాం తం చెప్పడం ఇంకా గుర్తు వుంది. "ఏమే రామిరెడ్డి, పెళ్ళాన్ని తెచ్చుకున్నావటగా. ఎప్పుడూ కనబడదేం? ఘోషాలో పెట్టా వా?" అని పట్వారీ ఎన్ని పర్యాయాలు ప్రశ్నించాడో గుర్తులేదు కాని, ఆ ప్రశ్న ఇంకా కలకవేస్తూనేవుంది. తీరా మొన్న మొన్న - రైతులకు వ్యతిరేకంగా తాను సాక్ష్యం చెప్పనందుకు, రజాకార్లను చూసి దేశముఖు అన్న మాటలు మరచిపోలేదు.

ఇప్పుడు ఇవన్నీ జ్ఞాపకం చేసుకుని అసలు చెయ్యగలిగిందేమీ లేదు. అయినా

ఎన్నని జ్ఞాపకం చేసుకుంటాడు. తన మేనత్త సంగతి ఏమిటి? ఊరూ కాడూ కోసి...! ఈ దేశముఖు ఒకటిచేసి ఒకటి చెయ్యలేదా? తన తాతలనాటి భూముల్లో ఇప్పుడు సగమన్నా లేవుగదా? ఏమై పోయినై? దేశముఖు కివ్వవలసిన నజరానాల కోసం వాడిదగ్గరే అప్పుచెయ్యడం, మళ్లీ వడ్డీలకు కట్టుకోలేక భూములన్నీ వాడికే కట్టబెట్టడం! ఈనాటు తలచుకుని తలచుకుని రాత్రి ఎంత కుంగిపోతుండేవాడో తనకు తెలుసు.

అసలు తనొక్కడనే ఏమిటి? వాడి నుండి ఊళ్లో ఎవరు తప్పించుకున్నాడుకనక.

వెంటనే "అట్లాగా" అని రామిరెడ్డి అందుకుంటాడని చూశాడు పట్వారీ. అతని ముఖంమీద ఏవో నీడలు కదలాడుతున్నట్లు చూసి కొంత సందేహించక తప్పిందికాదు.

"ఏమో రామిరెడ్డీ, సార్జెంటుకూడా వస్తాడంట. బహు దొడ్డదొరలే యేటు దెప్పించకపోతే బాగుంటుందా? వెంకణ్ణి పిలిపిస్తా" నన్నాడు పట్వారీ చొరవచేసి.

ఈ చొరవతో రామిరెడ్డి హృదయం చురుక్కుమన్నది. అప్రస్తుతాల్లోంచి ప్రస్తుతంలో పడ్డాడు.

"అసలు పోలీసోళ్లెందు, మామా, కమ్యూనిస్టులు తంతావుంటే, పారిపో యొస్తా వుండారాయేంది మనూరు?" అని అప్రయత్నంగానే అడిగాడు రామిరెడ్డి.

"పోలీసులు రాకపోవటమేంటి? వాళ్లు లేకుంటే ఒక్కక్షణం దక్కుతుందా? అరాచకం అయిపోదూ?"

కొంత దీనంగానూ కొంత తెగింపుగానూ మాట్లాడుతున్నాడు పట్వారీ.

"వాళ్లే వెళ్లగొడ్తున్నారంటుంటే. మాకెందుకు? మాకొంపకెక్కలేదు." అని ముఖం పక్కకుతిప్పి, బొడ్లో పొగాకు కాడ పైకి లాగి ఒక్క నిమిషంపు నిమిరింపు, దాన్ని నవరిస్తూ, అట్టే చూస్తున్నాడు రామిరెడ్డి; తనచుట్టూ ఎన్నడూ లేనట్టుగానే.

"అయినదానికీ కానిదానికీ ఈగడ్డేదా ఆగడ్డేదా ఎక్కేవాణ్ణి కాదు. సరేలే - వెళ్లొస్తా"నని వెళ్లిపోతగా పట్వారీ చెప్పిన మాటలుకూడా అతను వినిపించుకొని వుండడు.

2

పోలీసులు ఊళ్లోకి రాలేదుకాని, ఊరంతా కలకలంగానే వుంది. చుట్టుపట్ల గ్రామాలన్నిట్లోంచీ సైన్యం ఎత్తేసుకుని పోలీసులు పట్నానికి పారిపోతున్నారని అందరికీ తెలిసిపోయింది. పక్కవూళ్లో స్వరాజ్యం వచ్చేసిందట - దేశముఖు కాజేసిన భూములన్నీ ఎవళ్లవివాళ్లకు ఇచ్చేస్తున్నారంట కమ్యూనిస్టులు, భూములే కాదు, గడీలోవున్న గొడ్డుగోదల్నికూడా, వ్యవసాయం చేసుకోమని, లేనివాళ్లకిచ్చేస్తున్నారంట; పటేలు పట్వారీలు మళ్లీ కనపడకుండా పోయారంట; ఒక్క తగాదా లేకుండా జనమంతా కలిసి ట్యాగా ఉన్నారంట... ఆనోటా ఆనోటా ఈ అద్భుతాలు ఊరంతా కమ్ముకున్నాయి.

ఇట్లాంటి సంగతులు జరుగుతాయని వాళ్లు కలలోకూడా అనుకోని ఎరుగరు. ఇప్పుడు నడుస్తున్నకాలంలో ఇట్లాంటివి జరగటం చూస్తే, ఒక్కొక్కళ్ళలోనూ అంతులేని ఆందోళన బయలుదేరింది. ఏదో ఆశ

ఏదో ఆవేదన... క్షణం తీరిక చిక్కని ఆలోచన... ఒక్కసారిగా సంకెళ్ళు తెగి పోయినట్టూ, రెక్కలున్నవి గాలిలో ఎగిరి పోతున్నట్టూ — ఏదో అవ్యక్తమైన అనుభూతి.

పట్వారీకి తప్పకుండా కోపం వచ్చి వుంటుందని, ఎల్లాగూ తనకు కష్టాలు తప్పవని రామిరెడ్డి మనస్సులో గుణకారం ఆరంభించాడు. పట్వారీపోయి, తనమీద సార్జెంటుకు ఏం చెబుతాడో? దేశముఖు ఏమనుకుంటాడో ?

అయినా, తన ధైర్యం ఏమిటి? ఒకవేళ ఇవాళ తప్పించుకున్నా రేపనుకో, మళ్ళీ ఈ పోలీసులు రాకుండా పోతారా ? రేపు వచ్చే మిలిటరీ ట్రక్కుల మాటేమిటి ? తన మూలంగా ఊరూ నాడూ నాశనమై పోతుందేమో ! 'ఇదేం ఇక్కట్టేం బాబూ' అని రాళ్ళు వేళ్ళు పడినేమాత్రం, ఆరునూరు ఏమయింది? ఏమైనా, తన ఊరికిట్లాంటి గతి పట్టకూడదు !

ఊరు నలుముఖాలా బద్దలయ్యేటట్టు పెద్దపెద్ద కేకలు వినిపించడంతో రామిరెడ్డి ఆలోచన మధ్యలో తెగిపోయింది. నేలకు నేలు ఆకాశంతులా గొంతులూ కలిసి ఒక్క పెద్ద ఉత్సాహంగా, ఉప్పెనగా వినిపిస్తున్నాయి. రామిరెడ్డిగారి పుల్లి ఎగురుకుంటూ వచ్చి, "అందరం సంగం పెట్టాం మామా" అని ఏదో పరవశంగా పాడుకుంటూ, ఇంకా ఏమంటున్నాదే వుంది.

"ఏమిటో, ఆ అల్లరి... తిని కూచోలేక..." అని తన భార్య సంగమ్మ పెదవి పెట్టుకుంటూ, "అన్నా సంగం పెట్టామే" అని పుల్లి మళ్ళీ పాడుతూ ఎగరటమూ రామి రెడ్డి గీటా తెలుస్తూనే వున్నాయి.

తన చింతాకరకాం తెలియని ఏదో ఒక స్వర్గంలోనో, నరకంలోనో వున్నట్టు రామిరెడ్డి అంతా కొత్తగా చూస్తున్నాడు. అసలు ఏ సాంతాళ్లు ఏ గాఢాల్లోకి నడిచి పోతున్నాడో, ఏ ఆలోచన నిద్బ్రమ తెచ్చు తున్నాదో... అంతా అయోమయం.

కొలిమోల్లు గొంతులూ మట్టూ కొండల్లో లోయల్లో ప్రతిధ్వనిస్తున్న ఆ మహోత్సాహంలో ఏమూలో తన గొంతుకూడా అతికిడిగా వినిపిస్తున్నది రామిరెడ్డికి. ఆ వినిపించే ప్రతిగొంతులో తనగొంతే ప్రతిధ్వనిస్తున్నది. ఈ గ్రామమంతా ఇంతవరకూ తన మాటమీదనే నడుస్తున్నది. ఈ గ్రామం తనది; ఇదే తన సర్వస్వం. వీళ్ళంతా తనవాళ్ళు; వీళ్ళందర్ని కన్నతండ్రిలా కాపాడవలసిన భారం తన మీద ఏదో వుంది.

నినాదాలు దగ్గర దగ్గరకు వచ్చేస్తున్నాయి. ఒక వింత లయతో ఆ అడుగుల దడదడ భూదేవికి ఉత్సాహాన్ని చేస్తున్నది.

పాడుతున్న పుల్లి ఒక్కసారిగా గుంపులో కలిసిపోయింది. ఏదో ఆశ్చర్యం పొందుతున్న ఆనందంతో సంగమ్మ కూడా అలాగే పోతున్నది.

ఒక్క అడుగులో రామిరెడ్డి గుమ్మంలో నిలబడ్డాడు. ఊరేగింపుగా వచ్చిన ఊరు ఊరూ అనుకుంటూ అలాగే నిల్చుండగా నిలబడి పోయింది. తెగింపో ధైర్యమో కాదు కట్టుకొని రామిరెడ్డి ముఖం అంతకంతకూ గంభీరంగా మారిపోతున్నది.

"ఈ గ్రామం నాది. ఇక్కడ నా మాట సాగి తీరాలిసిందే. ఎవ్వడూ యెదురుచెప్పడానికి వీల్లేదు. ఈ ఊళ్లో ప్రతిఒక్కడూ ప్రతిఒక్కతే సంఘంలో చేరి తీరాలి! ఇది సంఘం ఊరు!!"

పట్టిపట్టిఅంటున్న ఆ ప్రతిఅక్షరంలోనూ అతని హుంకాతనంతో పాటు హృదయం కూడా తొంగిచూస్తూ, అతని అనుజ్ఞకోసంలా ఎదురుచూస్తున్న జనసామాన్యంలో కొత్త శక్తినీ ఉత్సాహాన్నీ రేకెత్తించింది.

"జై ఆంధ్రమహాసభకూ జై!"

ఆకాశం తోడు పలుకుతున్నది.

3

రచ్చబండదగ్గిర, ఊరంతా, ఏకమైంది. పక్కవూళ్ళ సంగతులన్నీ ఏకరువు పెట్టేస్తున్నాడు వీరప్ప పెద్ద పెత్తందారులాగా. అసలు యీ గొల్లవాడు ఎన్నడన్నా ఇన్ని గుండెలతో ఇక్కడ నిలబడి ఎరుగునా? రామిరెడ్డికి ఇది ఆశ్చర్యంగానే వుంది. కాని, వాడే తనకి తెలీని సంగతులు చాలా చెబుతున్నాడు.

దేశముఖు కాజేసిన రైత్వారీ భూములన్నీ ఆయా రైతులకు మళ్లీ ఇచ్చేస్తారు. గడీకి తోలుకుపోయిన గొడ్లను తిరిగి ఎవళ్లవి వాళ్లకు ఇప్పించారు. రెడ్డీ, కాపూ, మాలా, మాదిగా తేడా లేకుండా అంతా ఒక్కటిగా వుంటున్నారు.

వీరప్ప చెప్పే సంగతులు రామిరెడ్డికి ఆటే అంతు పట్టడం లేదు. కాని, అతని మనస్సు ద్వంద్వాతీతంగా వుంది — అతనికి ఇష్టమూ అయిష్టమూ అంటూ లేవు ఈ ఊరు తనది; ఇక్కడ ప్రతి ఒక్కడూ తను చెప్పినట్టు నడుచుకోవాలి. అంతే.

గోపాలరావు చిన్నవాడే కాని, దేశముఖు ఎవరెవరి భూములు ఎంతెంత ఆక్రమించాడో, వరసనే లెక్కలు చెబుతున్నాడు. గొడ్డు గోదల సంగతి వీరప్ప చెప్పేశాడు. దేశముఖు మనుషులొచ్చి ఎవళ్ళెవళ్ళ ఇళ్ళల్లో కోళ్లు కొట్టుకుపోయారో ఒక్కొక్కరే చెప్పుకుంటున్నారు. ఒకమ్మ తన పరాభవాన్ని చెప్పుకొంటూ, గొంతు తడి ఆరిపోయి, కళ్ళనీళ్ళు పెట్టుకుని నేలచూస్తూ నిలబడి పోయింది. మరోతల్లి, దేశముఖు గూండాలు తనబిడ్డ గుండెల్లో దిగేసిన గడ్డపలుగు కళ్ళల్లో మెదులుతూ నోట మాట రాకుండా కూలబడిపోయింది. నోరూ, మొహం వ్యక్తంచెయ్యలేని అనేకదుఃఖాలు అనేకులవి ఒక్కొక్కరికీ తమతమ అనుభూతులే వ్యక్తపరుస్తున్నాయి. అందరిదీ ఒకటే దుఃఖం; అందరి దుఃఖం ఒకటే.

"ఇంక ఈ వూళ్ళో ఇట్లాంటి దురాగతాలు జర నివ్వను. దేశముఖు మనుషులూ పోలీసులూ ఈ వూళ్ళో అడుగుపెట్టడానికి వీల్లేదు!" అని రామిరెడ్డి గర్జించాడు. నైజాం నిరంకుశత్వం నశించాలనీ, ధనవంతుల పెత్తనం పోవాలనీ అందరూ ఒక్కపెట్టున అరిచారు.

క్షణంలో మళ్ళీ ఒక్కొక్కరే మొదటి చర్చల్లోకి వచ్చేసారు. దేశముఖులాక్కున్న భూములూ, గొడ్డూ గోదా, ఎవళ్ళవి వాళ్ళ కిచ్చెయ్యాలి. వాడివల్ల నష్టపడ్డవాళ్ళ కందరికీ పరిహారం ఇవ్వాలి. వాడి స్వంతకమతాలు మినహాయించి కవుళ్ళకిచ్చిన భూములన్నీ కవులుదార్లకే

చెందాలి—అయితే వాడికి న్యాయమైన కవులు ధాన్యం చెల్లిస్తారు. అంటే వెనకటి లాగా పెళ్ళాం నగ్లపూసలమ్మి కాదు; పండిన పంటలో వాడికి ఎంతో కొంత మాత్రమే యివ్వాలి.

అంతా పైకి అంటే పైకి అన్నారు. అంతా బాగానే వుంది. కాని ఇవన్నీ ఎవరు చెయ్యాలి? వీరప్ప చెప్పాడు—పక్క వూళ్ళో పంచాయితీ పెట్టుకున్నారట

ఇట్లాంటివన్నీ వీరప్పకు బాగా తెలుసల్లే వుంది. పంచాయితీలో తప్పకుండా వీరప్ప వుండాలన్నాడు రామిరెడ్డి. ఎవ్వరికీ ఆక్షేపణ వున్నట్టు కనిపించలేదు. గోపాలరావు పేరు సూచించారు కొందరు. బస్తీలో చదువుకుంటూ సెలవలకి వూళ్ళోకి వచ్చిన సీతమ్మ గోపాలరావు చెల్లెలు "నేనుకూడా వుంటా" నని లేచింది. ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. రామిరెడ్డి కిదేమో విడ్డూరంగా తోచింది గావును — "ఆడవాళ్ళు మీరు దేనికి లేమ్మా, మేం వున్నాంగా" అన్నాడు. "పంచాయితీలో ఆడంగులు కూడా వుండాలిసిందే" అని పక్కవూరిసంగతి ఎత్తుకున్నాడు వీరప్ప. రామిరెడ్డి మరి మాట్లాడలేదు; తేలిగ్గా తీసేసుకున్నట్టుగా "అయితే సరే" అని తేల్చాడు. "సీతమ్మక్కకీ జై" అని పుల్లి కేక ఈలలాగా మోతపెట్టింది. అదో అయోమయంగా చూస్తూ కూడా అరుగు మీద కూచున్న రంగమ్మ మొహం ఎందుకో మెరిసింది.

పంచాయితీ నాలుగింటికీ ఇట్లాగే ఎన్నికైనారు. ఊరంతా తన మాటమీద నడిచితీరాలని గొంతు సవరించుకొంటూ పొరగా దగ్గాడు రామిరెడ్డి. "మీరు కవుళ్ళకిచ్చారుగదా పొలాలు వాటి మాటేమిటి?" అని సీతమ్మ కొంత తెంపుగానే అడిగింది. జనంలో కొంచెంగా అలజడి కలిగింది. అసలు రామిరెడ్డంటే అందరికీ ఎంతో కొంత భయంవుంది; భక్తీ వుంది. అదీగాక, ఇప్పుడు... డబ్బున్న ఆయన కూడా తమతో పాటు ఉండడం ఒకటీ...

అతను ఎన్నడూ ఎదురు జవాబులను సహించేమనిషి కాదు; ఎక్కడలేని అభిమానం పుట్టుకొస్తుంది.

"వెధవది నాపొలం మాటేంది? దేముడి పొలమైనా అంతే! రామాయణమంతా విని రాముడికి సీతేం కావాలన్నాడంట. ఇందాకట్నుంచీ చెప్పిందంతా యేమైపోయింది?" అని సీతమ్మను చివాట్లు పెట్టేంత పని చేసాడు; ఈ పంచాయితీకి ప్రెసిడెంటుగా వుండి తనేగదా, గ్రామాన్ని నడిపించాలిసింది!

జనంలో అలజడి పోయి ఒక్కసారి ఆనందం వెల్లివిరిసినట్లయింది. తోచనట్లు ఆలోచనగా రంగమ్మ అరుగుమీద బెత్తికలు ఒలుస్తున్నది. పుల్లి కళ్ళనిండా ఏదో అద్భుతం తొణికిసలాడుతున్నది. అంతా తనే అయినట్లు, తనదంటూ ఏమీలేనట్లుగా, గర్వంగా చూస్తున్నాడు రామిరెడ్డి.

"ఎవళ్ళభూములు వాళ్ళకిచ్చేస్తున్నాను. పోయి దున్నుకోండి!" అని వీరప్పవంక చూచి "ఒరేయ్ వీరప్పా..." అని ఇంకా యేమో చెప్పబోతున్నాడు రామిరెడ్డి.

సంఘం వూళ్ళో తక్కువకులాలవాళ్ళు గదా అని, ఒరే అరే అంటానికి వీల్లేదని తప్పుపట్టాడు గోపాలరావు "మరేం తప్పు లేదు లెండి, అరికేం పెద్దోరు" అన్నాడు వీరప్ప.

"కాదగ్రో, అలవాటుపోవ్వా? అనే శాను. ఏమయ్యా వీరప్పా, నువ్వు వెళ్లి యువళ్ళ గొడ్డుగోదల్ని ఆళ్ళకిచ్చేసెయ్యి" అని రామిరెడ్డి హుకుం జారీ చేశాడు. రోశముఖు ఎవళ్ళెవళ్ల కెంత నష్టపరిహారం యివ్వాలో తేల్చుకున్నాడు గోపాలరావు. ఆడవాళ్ళ కష్టసుఖాలూ మంచి చెడ్డలూ సీతమ్మ కొప్పజెప్పాడు. పొలాలకెళ్ళేవాళ్లకు పొద్దెక్కుతున్నదని తక్కిన సంగతులన్నీ రాత్రికి వాయిదా వేసి రొండినున్న పొగాకుకాడ తీసి తాపీగా చుట్టచుట్టుకుంటూ లేచాడు.

పొద్దుపొడిచిందో లేదో, రజాకార్లూ, పోలీసులూ వస్తున్నారని ఊరంతా పాక్కిపోయింది. ఎవళ్ళకు వాళ్ళు మూటాముల్లే కట్టుకొని పొలాల్లోకి వెళ్ళిపోతున్నారు. ఒకళ్ళ సంగతి ఒకళ్ళకు తెలీకుండావుంది.

వీరప్ప వచ్చి చెప్పేదాకా రామిరెడ్డికేమీ తెలీదు—దొడ్లో గొడ్లకాడ బాగు చేయిస్తున్నాడు. అంతా పారిపోతున్నారంటే, అతనికి తేళ్ళూ జెర్రులూ పాకినట్టయింది.

"ఇక్కణ్ణుంచి బయటికి వెళ్ళటానికి వీల్లేదు. రజాకార్లుగానీ, వాళ్ళ బాబులు గానీ ఈ ఊళ్ళో అడుగుపెట్టనివ్వను!" అని రామిరెడ్డి ఒక్క దూకులో వీధిలోకొచ్చేసాడు.

నడవలేక ఏడుస్తున్న పిల్లల్ని పడేసి ఈడ్చుకుంటూ, మొయ్యలేని బరువుల్తో యిక్కడికో వెళ్లిపోతున్నారు తల్లులు. కర్రమోపుమీద శరీరం కదిలించుకుంటూ, యింకా ప్రాణంమీద కడపటి ఆశలతో పడుతూ లేస్తూ పోతున్నారు. ముసలీ ముతకా యువకులు ఒక్కళ్ళూ కనిపించడంలేదు. రామిరెడ్డి మనస్సు చివుక్కుమంది. ఊళ్లో తనూ, తనతో పాటు వీరప్పా మిగిలిట్టున్నారు.

ఏమైనా, అతనిగుండె చెదరదు. అతని రక్తంలోనే పిరికితనంలేదు.

"పద! వీరప్పా. నడు! మనం ఇద్దరం చాలు!" అని దడదడా నడిచిపోతున్నాడు ఊరిమొగవున్న తన డాబా వైపు.

వీరప్ప యేదో చెబుదామని చూస్తున్నాడు; ధైర్యం చాలడంలేదు. కూడా నడవడం తప్పితే అతను చెయ్యగలిగిందేమీ లేదు.

గబగబా లోపలికెళ్ళి తుపాకి తీసుకొచ్చి, "ఇది నాకు మేకాల్ని కాల్చటానికిచ్చారు. చూసుకో. యిప్పుడీ మేకాల్ని కాల్చి పారవూస్తా!" అని తలెత్తేసరికి రామిరెడ్డికి యెదురుగా పాతికమంది యువకులు నిల్చొని వున్నారు. అతనికి అమాంతం తామసం వచ్చేసింది: "ఇంకా కణ్ణించి యాడ వచ్చారంట్రా?" అని ఒక పెద్ద పొలికేక పెట్టాడు.

గోపాలరావూ సీతమ్మా ఆ యువకుల్లోంచి ముందుకొచ్చారు. ఊళ్లో స్త్రీలనీ పిల్లల్నీ అందర్నీ సద్ది పొలాల్లోకీ గుట్టల్లోకీ పంపించిన వైనం చెబుతున్నాడు గోపాలరావు. (మిగతా 34 వ పేజీలో)

(24 వ పేజీ తరువాయి)

"ఇంతకంటే, గాజుల బత్తుణ్ణి పిలిపిస్తునే! ఈ ప్రతాపమంతా నీదా యేంది?" అని ఒళ్లు తెలీకుండా అరవడం మొదలు పెట్టాడు రామిరెడ్డి.

"కాదు, మామా, ఏడెనిమిది లారీలు వస్తున్నయ్. రెండు మూడొందలమంది దుంటారు. మన దగ్గరేమున్నా తుపాకులా పాడా? అందుకని..."

"ఇదుగో సీతమ్మా, చూడు, ఇది ఆడంగులు మాట్లాడే సమయం కాదు. మూతి మీద మీసం వున్నవాడు తోక ముడిచి పారిపోతాడా అంట! ఎన్ని వందలమంది వొచ్చినా సరే, నా గొంతులో ఊపిరి వుండగా ఈ గడ్డమీద అడుగు పెట్టనివ్వను. అంతే! ఇక్కణ్ణుంచి ఒక్క ప్రాణి బయటకు పోగూడదు!" అని రామిరెడ్డి చండ శాసనంగా మాట్లాడుతున్నాడు.

గోపాలరావూ వీరప్పా తనకు నచ్చజెప్పాలని చేసే ప్రయత్నం చూస్తే అతనికి మరీ మండిపోతుంది. చేతిలోవున్న తుపాకీ ఎత్తి ఆ పాతిక మందికీ బారు చేసాడు

"ఎక్కడికీ పోనివ్వను. ఇక్కడే వుండి తీరాలి. నడవండి ముందు! లోపలికి..."

తుపాకి చూపి అందర్నీ మేడ గదిలోకి నడిపించి బయట గొళ్లెం పెట్టాడు. తాను ఇంకో గదిలో కెళ్ళి, అక్కడ దాచి వుంచిన తుపాకి మందు తెచ్చి వరండా నాపరాతిమీద కుప్పగా పోసి, గొళ్లెం తీసి వీరప్పనూ గోపాలరావునూ మరి అయినగుర్ని బయటికి రమ్మన్నాడు. పిలవకపోయినా, సీతమ్మ కూడా వచ్చి నిల్చుంది.

"ఆడదానివి..." ఏదో అనబోయి, మళ్ళీ తిప్పుకొని "నువ్వు తుపాకిలో మందు కూరి ఇస్తావుండు. వీళ్లు అంచెల మీద డాబామీదికి నాకు అందిస్తా వుంటారు" అని పని స్వభావం ఏమిటో తేల్చి చెప్పి, రామిరెడ్డి తుపాకీ తీసుకుని ఊగులాడుతున్న నిచ్చెన మీదిగా డాబామీదకెక్కి, పిట్టగోడ మాటుచేసుకొని పొలాల మీదికి చూస్తూ పడుకున్నాడు.

దూరాన గుట్టల్లోంచి దొంకనే పడతోసుకొస్తున్న లారీలు ఆకాశం నిండా దుమ్ము కొడుతూ రణగొణధ్వని చేస్తూ ఇంకా ఇంకా దగ్గిర కొచ్చేస్తున్నాయి. లారీల్లో మనుషులు కన్పిస్తున్నారు... ఆ బ్రెన్ గన్లూ, ఆ రైఫిళ్లూ, ఆ బయొనెట్లూ - అవీ...

రామిరెడ్డి చేతిలో తుపాకీ ప్రచండంగా గర్జించింది. తొలిగా వస్తున్న లారీ ఈతేసి కూలిపోయింది. లారీలోంచి పోలీసులు నఖముఖాలా దూకుతున్నారు. ఒకటీ కాదు, రెండు కాదు—వందల తుపాకుల నిప్పులు కురిపిస్తున్నాయి. ఆ లారీల తేపిన దుమ్మంతా అంతలో ఎగ్రపడి పోతున్నది. ఒక తుపాకీ [illegible] సింగరు మిషనులా, కొట్టుకుంటున్నది పోలీసు తుపాకులు కక్కిన వేలకొలది గుళ్లు గాలిలో కలిసిపోతున్నాయి. కొన్ని డాబాగోడలకూ పిట్టగోడకూ తగిలి తిరుగుముఖం పడుతున్నాయి.

ఇక్కడ రామిరెడ్డి తుపాకికి మంద

సరఫరా శరవేగంతో జరుగుతున్నది. ఒక్కొక్క మనిషి వందమంది బలంతో పనిచేస్తున్నాడు. మూరెడు తుపాకీ, అంచెల మీద నడిచే తుపాకీ, శత్రువుల మీద మృత్యువును పిసిరే తుపాకీ.....ఒక్కటే అయినా... వెయ్యి తుపాకులుగా నడిచి పోతున్నది.

కేక పెట్టి మన్ను కరుచుకున్నాడు ఒక రజాకారు. ఇంకో తుపాకి గింగిరాలు తిరిగి చెట్టును అంటుకుపోతూంది. మరొకడు లారీ మీదనుంచి పడ్డ పాటున గుట్టమీద పడి, పక్కనేవున్న గుంటలోకి దొర్లి పోతున్నాడు.

శత్రువుల మందిబలాన్ని మందుబలాన్ని చిందరవందర చేసింది నాటుతుపాకీ. రజాకార్ల సాహసం పూర్తిగా దిగిపోయింది. ఈ గ్రామంలో యెంతమంది కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రజానాయకత్వం వహిస్తున్నారో—సార్జెంటుకు అనుమానంగా యిప్పుడిప్పుడే స్ఫురిస్తున్నది.

మరతుపాకిదగ్గర కూచున్న ముస్లిమ్ యువకుడు దానితో పెనేసుకుని మెలికలు తిరిగిపోతూ, నేలమీద పడుకుపోయాడు. ఒకడా, ఇద్దరా? ఏ ఒక్క సైనికుడూ ఒంటరిగా పోరటంలేదు. అసలు ఒంటరిగా పోరాటం అలవాటుకూడా లేదు వాళ్లకు. ఆ పోరాటంలో ఏం అయినా ప్రజలనేవాళ్లు వుంటారని గ్యారంటీ ఏమిటి? ఒక్కొక్కరూ కోటి సైనికుల్ని తోడు తీసుకొని మరీ పోతున్నారు.

ఒకళ్లా ఇద్దరూ కాదు. డెబ్బై మున్గురు రాజబంధువులు రజాకార్ల నిస్సంకోచంగా తెలుగు గడ్డమీద తమ శరీరాలు పరచుకున్నారు.

ఇంకా రామిరెడ్డి తుపాకీ గుళ్లు రువ్వుతూనేవుంది పాపమన్నా లేకుండా, రాజబంధువుల్ని నేలకూలుస్తూనేవుంది.

సార్జెంటు మతి మతిలో లేకుండా పోయింది. కాని యుద్ధనీతిలో నేమి రాజనీతిలో నేమి ఆ మతోన్మాదకుడు బాగా ఆరితేరినవాడు గనుక, ఎట్లాగైనా జారిన కాలు నెమ్మదిగా తీసుకోవాలనే నిశ్చయానికి వచ్చేసాడు. అయినా, ఈ కాఫిర్ ముండాకొడుకులు పోలిస్తేనా? వాడు తిరుగు ముఖం ప్లాను ఆలోచిస్తూనే వున్నాడు; రాజబంధువులు ఆ గుట్టల్లో గోతుల్లో స్థిరనివాసాలు యేర్పాటు చేసుకుంటూనే వున్నారు.

అక్కడ మంటల్లో రెండు లారీలు ముక్కలుముక్కలుగా విరిగి నేలమీద రాలిపోతూ, వాటికింద పడున్న రజాకార్లను తెలుగు సంప్రదాయం ప్రకారం అగ్నిసంస్కారం చేస్తున్నాయి. పాపం, వాళ్ళ సమాధులకూడా చోటులేదు గావును ఈ విశాలాంధ్రలో!

రామిరెడ్డి తుపాకీ ప్రళయ ప్రళయంగా అగ్నిపర్వతాలు విరజిమ్ముతున్నది. అతని మాటప్రకారం తుపాకిదెబ్బకూ వ్యత్యాసం కావడంలేదు. ఎవడిమీద కన్నుపడ్డదో వాడిమీద దెబ్బపడ్డదే!

తను విజయం కళ్ళారా చూస్తున్నాడు గాని, యింత మాత్రంతో అతని బాధ్యత తీరేది కాదు. ఈ పూట రంది. ఇక్కడి ప్రజలంతా తన వాళ్లు; తను చెప్పినట్టు

నడుచుకో వలసిం వాళ్లు. వాళ్లందరి ప్రాణాలకూ పూచీ పడవలసినవాడు తనే

ఇంత ఆలోచనతోనూ, నిబ్బరంతోనూ తుపాకీ కాలుస్తున్నాడు రామిరెడ్డి. అంతలో హఠాత్తుగా 'అమ్మా' అంటూ పొత్తికడుపు పట్టుకొని ముడుచుకు పోయాడు. పక్కగా చెట్టుమీది కెక్కి వున్న రాఘవరెడ్డిని అప్పుడే ఆ ముసుగుకు పోతూ లీలగా గుర్తుపట్టాడు. పొత్తి కడుపులోంచి రక్తం ఓడికలు కడుతున్నా అతని నరాలు ఒక్కసారి జీవంతో చకితమైనాయి. శరీరం ఒక్కసారిగా సాగింది. అంచెమీద వచ్చిన తుపాకీ అందుకున్నాడు. ఒక్కటే దెబ్బ. కేక పెట్టి, గిరాగిరా తిరుగుతూ రాఘవరెడ్డి నేల మీదికి రాలిపోతున్నాడు. రామిరెడ్డి కళ్ళు నిండా కమ్ముకున్న నీళ్లు కారా కుండా అతని రెప్పలు కప్పివేసాయి.

గోపాలరావుకు గానీ వీరప్పకుగానీ తుపాకి కాల్చటం తెలీదు తక్కినవాళ్లకు అదంటేనే భయం ఏమైనాసరేనని, గోపాలరావు కొత్తగా సాధనచేసి దాని విసురుకు తట్టుకోలేక వదిలెయ్యడంతో అక్కడ పోగుపడున్న తుపాకి మందు కాస్తా గుప్పున మండిపోయింది.

మళ్లీ తుపాకిదెబ్బ వినిపించకపోవడంతో రజాకార్లకూ పోలీసులకూ క్రమక్రమంగా గుండెలు కుదుటపడుతున్నాయి. ముందుకు పోదామా అని సార్జెంటు అనుకుంటున్నాడే కాని, వాడు తెలివైన మనిషి. వాడికి గెరిల్లాల ఎత్తుగడలతో అదివరకు సొంతంగా పరిచయం లేకపోయినా చాలా కథలు విన్నాడు. వందమందికి పైగా తన సాయుధ సైనికులు కూలిపోయారంటే, అవతల ఎంతమంది కాఫిర్లువుండి వుండాలో వాడు సులభంగా అంచనా వెయ్యగలడు. అయినా, ఎంతసేపని వాడు అలా గుండు వస్తుందేమోనని ఎదురుచూస్తూ వుంటాడు? తన శరీరం ఒక్కసారి తడివి చూసుకున్నాడు ఏమీ చెక్కుచెదిరినట్లు లేదు. అసలు వాడికి ముందుగానే తెలుసు – ఈ గెరిల్లాలు ఎంతమందున్నా వాణ్ణేంచెయ్యలేరని. "ముందుకు నడవం"డని పోలీసులకూ రజాకార్లకూ ఆజ్ఞాపించాడు. వాళ్లూ పదిలంగానే ప్రతి అంగుళం ఆక్రమిస్తూ ఊరిమీద వచ్చిపడ్డారు. డాబాచుట్టు ముట్టి మొత్తం పాతికమందినీ పట్టుకుని గోడకానజేసి వరసగా నిలబెట్టారు.

పోలీసుల్ని నడుపుతూ వెనకగా వచ్చిన సార్జెంటు ముందుకొచ్చి ఠీవిగా నిలబడ్డాడు. అతనిచేతిలో రివాల్వరు ఊగులాడుతూ చుట్టూ చూస్తున్నట్టుంది.

వాడికి ముందే తెలుసు. ఇక్కడ ఏ వందమందో హిందువులు వుండి వుంటారు. తీరా ఇప్పుడు పాతికమందే దొరికితే తక్కినవాళ్లెక్కడో దాక్కొనివుండాలి. ఈమాత్రం తెలీదా వాడికి.

తాను నడిచే నేలమీదకూడా నమ్మకం లేదేమోవాడికి, నిదానంగా అడుగుతీస్తూ శీతమ్మ దగ్గిరకొచ్చి రివాల్వరుతో ఆమె రొమ్ముమీద ఫెటీమని పొడిచాడు.

"లంజా! తక్కిన వాళ్లనెక్కడ దాచావు?"

ఆమె మొహం ఎఱ్ఱగా కందిపోయింది. క్రోధంతో నల్లబడుతున్నది. వీరప్ప శరీరం ఉద్రేకంతో పొంగిపోయింది. తను పట్టుకున్న పోలీసును విదిలించి నేలకు కొట్టి సార్జంటు గొంతు పట్టుకొని నొక్కి పారేస్తున్నాడు. కాళ్లు తేలిపోయి గిల గిల్లాడుతున్నాడు సార్జెంటు. ఒక్కసారిగా వంద తుపాకులు పేలిన మోత. సార్జెంటుతో పాటు నేలమీద పడిపోయాడు వీరప్ప

శవంగా నేలకు కరచుకున్న సార్జెంటును చూసాక, పోలీసులకూ రజాకార్లకూ 'గెరిల్లా'ల మీద 'నమ్మకం' పోయింది. ఇంకా వీళ్లనునమ్మి దగ్గరకు రావడానికి వీల్లేదు.

"వరసనే కాల్చి పారెయ్యండి!" అని అరిచాడొక పోలీసు. మరొకడు ఈ గెరిల్లా శ్రేణికి రెండు గజాల దూరంలో నుంచుని "ఆగండి తక్కిన వాళ్లనెక్కడ దాచారో కనుక్కుంటాను" అని సార్జెంటు చేతిలోంచి జారిపడిన రివాల్వరు చేతికి తీసుకుని,సీతమ్మ వైపు గురిపెట్టాడు.

"రావే లంజా, ముందుకురా" అని గద్దించాడు పోలీసు. ఆమె అడుగు ముందుకు వెయ్యలేదు. సరికదా, చలించనైనా లేదు.

"వస్తావా? లేదా?" మళ్లీ కేక మళ్లీ చలనంలేదు. రివాల్వరు మోగింది. "ఆంధ్ర మహాసభకూ జై" అంటూ ఆమె కూలిపోయింది.

గోపాలరావు కళ్లల్లో నీళ్లుకాదు, నిప్పులు తిరిగాయి. చావుకు రెండు చావులా? ఎగబడి, దగ్గర్లోవున్న పోలీసు వాడిచేతిలో తుపాకిలాక్కొని, అందిన వాణ్ణల్లా తిరగేసి కొట్టడం ఆరంభించాడు. తక్కిన ఇరవైముగ్గురికీ మంచి ఉపాయమే దొరికింది; తుపాకులు పోయిన పోలీసులు టోపీలు పడిపోయిందికూడా చూడకుండా పారిపోతున్నారు. మిగతావాళ్లు తిన్నగా గాభరానుంచి తేరుకుని కాల్చటానికి తుపాకులు గురి చూసుకుంటున్నారు. ఒకటి రెండు తుపాకులు పేలాయి. ఒకరిద్దరు 'గెరిల్లా'లు పడిపోయారు.

బాణాకర్ర దెబ్బలాగా 'గెరిల్లా'ల తుపాకిదెబ్బ తిన్న పోలీసు మళ్లీ నడుం ఎత్తినపాపాన పోవడంలేదు మళ్లీ తుపాకులు పేలుతున్నాయి. 'గెరిల్లా'లు పడిపోతున్నారు.

"కమ్యూనిస్టుపార్టీ జిందాబాద్" అని ఎక్కడో కొండలోగుట్టలో అరుస్తున్నట్టు గాలి కబురు తెచ్చింది. తుపాకులు తిప్పి పట్టుకున్న 'గెరిల్లా'లకు పోయిన ప్రాణాలులేచి వచ్చినట్లయింది. "కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్!" ఒక రజాకారు నెత్తురు కక్కుకుని మన్ను తింటున్నాడు. ఒక పోలీసు మెడ తిరిగిపోయి అల్లాడ తల్లడై పోతున్నాడు.

"కమ్యూనిస్టు పార్టీ జిందా బాద్!"
"ఆంధ్ర మహా సభ జిందాబాద్"
మళ్లీ కొండలూ గుట్టలూ మరింత గట్టిగా అరిచాయి. చుట్టూ ఈలలు రక రకాల ఆరోహణలతో వినిపిస్తున్నాయి.

పోలీసులకూ రజాకార్లకూ ఇలాంటి ఘట్టాలు అనేకం తెలుసు. ఇలాంటి ఆపత్సమయాల్లో ఎవడి కర్తవ్యం వాడు నిర్ణ

యించుకోవడ మనేదే వాళ్ళనీతి ఎగడి దోవ వాకు చూసుకోవాలన్న తహ తహ ప్రారంభ మైంది యూనిఫారాలు నేలకు కొట్టి లోపలి బనీను, ధోవతులతో మందలు మందలుగా పారి పోతున్నారు పచ్చ చొక్కాలు పారేసి పరుగెత్తుతున్నారు రజాకారు వీరులు.

ఊరిచుట్టూ ఒక్కసారి ఫెటేల్ ఫెటేల్మని గెరిల్లా తుపాకులు నోళ్ళువిప్పిన శబ్దం ప్రతిధ్వనించింది. మళ్ళీ నిశ్శబ్దం. అక్కడా అక్కడా చిన్న చిన్న గద్దింపులు.

మళ్ళీ పెద్దపెట్టున నినాదాలు మొదలు పెట్టాయి. "కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్! ప్రజాసైన్యం జయించాలి!!" వేల గొంతులు - ఆడగొంతులు, మగగొంతులూ, ఒక్క గొంతుగా మోగుతున్నాయి

అంతదాకా నిర్మానుష్యం గా కనిపిస్తున్న గ్రామం ఒక్కసారి నిద్రలేచి నట్లయింది. ఒక మహా తేజస్సు విరజిమ్మే జ్వాలనేత్రం వికసించి నట్లయింది శ్మశాన శాంతి బద్దలై ఒక మహా క్రాంతి ప్రాదుర్భవించి నట్లయింది.

చుట్టుపట్ల కొండల్లోగుట్టల్లో దాక్కొని పోయిన ప్రజలంతా, గెరిల్లా దళంతో పాటు తిరిగి వచ్చేస్తున్నారు. నగర రజాకార్లకూ పోలీసులకూ పారిపొయ్యే దోవ లేదు. వీధుల్లో ముంగిళ్ళలో సందుల్లో గొందుల్లో కొండల్లో కోనల్లో అంతటా ఒక్కటే ప్రజా సైన్యం.

రజాకార్లు పోలీసులుదళంగా చేతులు కట్టుకుని ముందు నడుస్తున్నారు

గమనిక

ఈ సంచికను ఎక్కువ రచనలతో, చిత్రాలతో తెలంగాణా ప్రత్యేక సంచికగా ప్రకటించడం వల్ల "అభ్యుదయ" జూన్ నెల సంచిక వెలువడదు. పాఠకులు గమనించ ప్రార్థన.

— సంపాదకులు.

క్షణంలో అందరూ అన్ని మూలలనుంచీ రామిరెడ్డి దాబాముందుకు వచ్చి, బార్లు తీరి నిలబడ్డారు గెరిల్లాదళం నాయకుడు జగన్నాథరెడ్డి, దెబ్బలుతిని కదలికలుగా వున్న యోధులను వెన్నుతట్టి ధైర్యం చెబుతూ, గోపాలరావు దగ్గరికి వచ్చాడు.

బయొనెట్ దెబ్బకు గోపాలరావు వెన్ను తగాలుపడిపోయింది కక్కుకున్న రక్తం నోటినిండా నిండి, నాలికను చుట్టుకొని, నోరు పెగలకుండా వుంది. తల తిరిగి పోతున్నది మరి నిలబడేశక్తి లేదు. కాని, అతనికి దళాధిపతిమీద ఉన్న గౌరవం అంతంతమాత్రపుది కాదు; అది హృదయంలోంచి ఉట్టి పడుతున్నది

"కమ్యూనిస్టుపార్టీ జిందాబాద్!" అని పిడికిలిబిగించి, ఆ రక్తజిహ్వకతో దళాధిపతికి తన తుదిఅభినందనాలు తెలియజేసాడు గోపాలరావు; అవే అతని తొలి అభివందనాలు కూడా !